క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు వరకు స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

27న రంగస్థల పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై ఈ నెల 27, 28వ తేదీల్లో ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకుని ఆరుగురు కళాకారులకు పురస్కారాల్ని ప్రదానం చేస్తున్నట్లు అధ్యక్షుడు బొప్పన నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. 27న సాయంత్రం 6 గంటలకు జరిగే సభలో పురస్కారాల ప్రదానం, రాత్రి 8 గంటలకు ప్రక్షాళన నాటిక, 28న సాయంత్రం 6 గంటలకు నాన్న నేనొచ్చేస్తా నాటిక, 8 గంటలకు మయసభ ఏకపాత్రాభినయం ఉంటాయని వివరించారు. కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు సోమవారం వైద్యులంతా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలని ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆవుల శ్రీనివాస్, డాక్టర్ వెలగా మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన లోపభూయిష్టమైన ఆరోగ్య హక్కు చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వైద్యులపై పోలీసుల అమానుష లాఠీచార్జికి నిరసనగా సోమవారం ఐఎంఏ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమంలో వైద్యులంతా పాల్గొనాలని వారు కోరారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో కళాలయ మెలోడీస్ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.వి. రత్నాజీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 19వ సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో అన్నదాన సమాజ చైర్మన్ పోకల వసంత్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయకులు పి. మొగిలి, ఈ. భరత్ రెడ్డి, పి. గాయత్రీదేవి, వి.ఎస్.ఎస్. మల్లేశ్వరరావు, పావని అలనాటి పాటల్ని ఆలపించారు. అనంతరం కళాకారుల్ని సంస్థ నిర్వాహకులు సత్కరించారు.

పోలూరికి ఎంపీ పరామర్శ

గుంటూరు లీగల్: వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. గుండె ఆపరేషన్ చేయించుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం పోలూరిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాల్ని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

చిన్ననాటి నుంచే సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి



గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చల్లావారిపాలెం గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు తెలిపారు. చల్లవారిపాలెంలో నగరంలోని టీజేపీఎస్ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులు వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థులు సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. గ్రామస్తులకు వ్యక్తిగత శుభ్రత, పారిశుద్ధ్యం, చదువు ప్రాముఖ్యత, వ్యసనాల వల్ల కలిగే నష్టాలు, వైద్య శిబిరం, వివిధ సామాజిక అంశాల గురించి అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి జె.వి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఎదుటువారిని ప్రేమించే గుణం ఏర్పడతాయని పేర్కొన్నారు. సమాజ స్థితిగతులు తెలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ రవిశేఖర్, అసిస్టెంట్ కో- ఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ తెల్లాకుల శ్రీనివాసబాబు, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్‌తో పాటు సెక్రటరీ కె.లక్ష్మి, వీఆర్వో సీహెచ్. లూర్థురాజు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు అండగా సీఎం జగన్


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న క్రైస్తవ సంఘ నాయకులు

నెహ్రూనగర్: రాష్ట్రంలో దళిత క్రైస్తవులకు అండగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మేద్దు ప్రేమజ్యోతిబాబు పేర్కొన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానాన్ని హర్షిస్తూ బొంగరాలబీడులోని సంఘ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. నేడు రాష్ట్రం దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేయించి కేంద్రానికి పంపడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బండారు అరుణ్, కందుల దీనమణిరాజు, థామస్, వాసిమళ్ల విజయ్, విజయ్, అంకాల రాజు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే ఫాసిస్టు ప్రభుత్వాలకు అడ్డుకట్ట

విరసం రాష్ట్ర నాయకురాలు వరలక్ష్మి


సభలో మాట్లాడుతున్న వరలక్ష్మి

పాత గుంటూరు: బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం ఆధ్వర్యంలో అమరులు కామ్రేడ్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 92వ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర సదస్సు నిర్వహించారు. భారతీయ సంస్కృతుల పరిణామం, ఫాసిజం, ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటన ఆవశ్యకతపై నిర్వహించిన సభకు పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి నేటి వరకు పాలక పార్టీలు దోపిడీదారుల పక్షానే ఉంటున్నాయని విమర్శించారు. ఐక్య ఉద్యమాలతోనే ఫాసిస్ట్ ప్రభుత్వాల్ని ఎదుర్కోగలమని తెలిపారు. రాష్ట్ర పీడీఎం ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ ఫాసిస్ట్ ప్రభుత్వాల దమనకాండను ఎదుర్కోవాలంటే ప్రజాస్వామ్యవాదుల ఐక్య కార్యాచరణ ద్వారా మాత్రమే సాధ్యమని వివరించారు. అనంతరం 'అదాని ప్రకంపనలు- వ్యవస్థాగత సంక్షోభానికి ఉదాహరణ'పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రజాకళా మండలి గాయకులు ఆలపించిన ప్రజా చైతన్య గేయాలు సభికుల్ని ఉత్తేజపరిచాయి. కార్యక్రమంలో ఎస్. వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్, సి.ఎస్.ఆర్. ప్రసాద్, నల్లూరి రుక్మిణి, పీపీఎం కార్యదర్శి సుధాకర్, హనుమంతరెడ్డి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వెంకటస్వామి కృషి


వెంకటస్వామిని సత్కరిస్తున్న అరవపాల్, రామకృష్ణ, దేవపాల్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వెంకటస్వామి కృషి మరువలేనిదని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ (ఏపీజీఈఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవపాల్ పేర్కొన్నారు. జెడ్పీ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఆదివారం ఏపీజీఈఎఫ్ రాష్ట్ర కోశాధికారి, పంచాయతీరాజ్ గవర్నమెంట్ మినిస్ట్రీయల్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి వెంకటస్వామి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అరవపాల్ మాట్లాడుతూ 37 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ నిర్వహణలో వివాదరహితుడిగా, సమర్థ నాయకునిగా వెంకటస్వామి ఏపీజీఈఎఫ్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఉద్యోగులు ప్రమోషన్లు, పోస్టింగ్స్ విషయంలో వివక్షతకు గురై, అన్యాయం ఎదుర్కొంటున్న తరుణంలో వారికి న్యాయం చేసి, హక్కులు సాధించి పెట్టిన గొప్ప నాయకుడు అని తెలిపారు. అనంతరం వెంకటస్వామిని శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, బత్తుల అంకమ్మరావు, డాక్టర్ కిశోర్, హనీఫ్, పేరుపోగు ప్రసన్నకుమార్, జాస్తి రామారావు, కామ్రేడ్ శ్రీనివాసరావు, నవోదయం, మాధురి, లత, సదాశివరావు, సాయి పాల్గొన్నారు.

రెడ్డి హాస్టల్‌లో కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం


సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంగళగిరి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మండపాటి శరత్‌రెడ్డి

నెహ్రూనగర్: విద్యార్థుల అభ్యున్నతి కోసం దాతలు ముందుకు వచ్చి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్, అమెరికా ప్రవాసాంధ్ర దాతల ఆర్థిక సౌజన్యంతో నగరంపాలెంలోని రెడ్డి జనాభ్యుదయ మండలి(రెడ్డి) హాస్టల్‌లో కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, నాటా యూఎస్ఏ మండపాటి శరత్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే ఆర్కే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత సాంకేతికకు అనుగుణంగా దాతలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని సూచించారు. కార్యక్రమంలో మందపాటి బాలకృష్ణారెడ్డి, సరస్వతి, సూరసాని వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, సీతారామ్‌ప్రసాద్ రెడ్డి, లేళ్ల పెద అప్పిరెడ్డి, వాకా వెంకటేశ్వరరెడ్డి, జె. సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



పెదనందిపాడు: మండలంలోని కొప్పర్రులో ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఉదయం అర్చకులు వేముల కూర్మయ్య, చెన్నకేశవరావు ఆధ్వర్యంలో నరసింహ హోమం, పంచముఖి ఆంజనేయ ఆయుష్య హోమాలు, అభిషేక పూజలు జరిగాయి. అనంతరం స్వామి గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామస్తులు వార్లు పోసి, కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిచెరుకూరు మండలం ఇంజనంపాడు గ్రామానికి చెందిన కొండమూరి పుల్లారావు(27) ఆదివారం రాత్రి చిలకలూరిపేట నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో పొత్తూరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాతో దాడిపై కేసు నమోదు

పెదకాకాని: మద్యం సీసాతో దాడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన చల్లా దయాకర్ పెదకాకాని మండలం మద్దిరాల కాలనీలో నివసిస్తున్న తల్లి వద్దకు వచ్చాడు. కాలనీ శివారులో ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వద్ద ముళ్ల పొదల్లో కొందరు వ్యక్తులు ఉండగా అక్కడి వెళ్లి చూసేసరికి వారు పేకాటలు ఆడుతున్నారు. ఎందుకు వచ్చావు.. వెళ్లి సిగరెట్లు తీసుకురా అంటూ కేకలు వేయడంతో వాదన పెరిగి చొక్కా పట్టుకుని కొట్టారు. ఆ తరువాత కొంతసేపటికి దయా కర్ మామయ్యను వెంట పెట్టుకుని సమీపంలోని బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఉన్న పేకాటరాయుళ్ల వద్దకు వెళ్లి దాడిపై నిలదీశాడు. మళ్లీ వాగ్వివాదం జరిగి చేతిలో ఉన్న బీరు బాటిల్‌తో దయాకర్‌ను కొట్టి గాయపరచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ఆసరాతో డ్వాక్రా మహిళల ఆర్థిక ప్రగతి


వట్టిచెరుకూరులో చెక్‌ను డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత


కుర్నూతలలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- వట్టిచెరుకూరులో మూడో విడత 'ఆసరా' సంబరాలు

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు 'ఆసరా'తో ఆర్థిక ప్రగతి లభిస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోట సుచరిత తెలిపారు. నియోజకవర్గంలో మూడవ విడత 'వైఎస్సార్ ఆసరా' పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మండల కేంద్రం వట్టిచెరుకూరులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుచరిత డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందజేశారు. ఆసరా ద్వారా చేకూరుతున్న ప్రయోజనాలు, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ఆసరా ఎలా అండగా నిలుస్తుందన్న విషయాలపై లబ్ధిదారులతో ఆమె చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకున్నప్పటికీ, సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఏటా క్రమం తప్పకుండా ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత వంటి సంక్షేమ పథకాలు పేద మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు వారి కుటుంబాల్ని ఆర్థిక ప్రగతి వైపు నడిపిస్తున్నాయని ఆమె వివరించారు.

నియోజకవర్గంలో రూ.105.69 కోట్ల లబ్ధి

నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.105.69 కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే సుచరిత తెలిపారు. 4,235 గ్రూపులకు మొదటి విడతలో రూ. 35.20 కోట్లు, రెండో విడతలో రూ. 35.27 కోట్లు, మూడవ విడతలో రూ. 35.23 కోట్ల చొప్పున నగదును సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేరుగా డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ చేశారని సుచరిత వివరించారు. ఒక్క వట్టిచెరుకూరు మండలంలోనే మూడో విడత కింద 996 గ్రూపుల్లో 9,960 మంది మహిళలకు గాను రూ. 8.96 కోట్లను వారి ఖాతాలకు జమచేసిన ఘనత వైఎస్సార్ సీపీదని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భీమినేని వెంకటలక్ష్మి, ఎంపీపీ చిలకా రాజ్యం, మన్నవ వీరనారాయణ, ఎన్. రామచంద్రయ్య, ఎంపీడీవో దీప్తి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం

వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా వట్టిచెరుకూరు మండల పరిధిలోని కుర్నూతలలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. గ్రామ సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మహిళలు స్థానిక గ్రామ సచివాలయ వద్ద సీఎం చిత్రపటానికి అభిషేకం చేశారు.

థాంక్యూ సీఎం సర్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆసరా ఎంతగానో ఉపయోగపడుతుందని, స్వయం ఉపాధి యూనిట్లు సైతం నెలకొల్పుకునేందుకు వీలుఉంటుందని మహిళలు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బుర్రి ప్రకాష్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలం


ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, సాంబశివరావు తదితరులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్సీ అప్పిరెడ్డి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు పార్టీ కార్యకర్తల శ్రేయస్సు కూడా తమకు ఎంతో ముఖ్యమని, అదే తమ పార్టీ నినాదం, విధానమని ఆయన పేర్కొన్నారు. నగరంలోని 50వ డివిజన్ మల్లికార్జునపేట 2వ లైనులో నివాసం ఉండే పార్టీ కార్యకర్త గుడిమెట్ల భవాని గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. షుగర్ వ్యాధితో కాలు కూడా కోల్పోయి మంచానికే పరిమితమైన నేపథ్యంలో విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఆలా సాంబశివరావు, స్థానిక పార్టీ నేతలతో కలసి ఆదివారం భవాని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి చేతుల మీదుగా ఆలా సాంబశివరావు లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ బోడపాటి ఉషా కిశోర్, పార్టీ నేతలు ఉడతా కృష్ణ, తుమ్మేటి శ్రీను, జ్యోతిబాబు, అరవ తిమ్మరాజు, పానుగంటి చైతన్య, గుల్లు బాషా, ఆలా కిరణ్, పాటిబండ్ల కిరణ్ పాల్గొన్నారు.

వైద్యులకు అబ్దుల్ కలాం పురస్కారాలు


శ్రీనివాసమూర్తిని సత్కరిస్తున్న సంస్థ సభ్యులు, వైద్యులు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని ఓ హోటల్‌లో యాక్ట్ నౌ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విశిష్ట వ్యక్తులకు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్, మెడికల్ ఎక్స్‌లెన్స్ అవార్డుల్ని ప్రదానం చేశారు. సభకు సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.ఎస్. మూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా అధికార భాషా సంఘం రాష్ట్ర చైర్మన్ పి. విజయబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ సమాజంలో సేవా కార్యక్రమాల్ని చేసే వారిని ప్రోత్సహించేందుకు అవార్డుల ప్రదాన కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.యాక్ట్ నౌ సేవా కార్యక్రమాల్ని కొనియాడారు. అనంతరం మాజీ సైనికుడు శిష్ఠా, శ్రీనివాసమూర్తికి జీవన సాఫల్య పురస్కారం, నగరంలోని వైద్యులకు అబ్దుల్ కలాం పురస్కారాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ రామరాజు శ్రీనివాసరావు, రమేష్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ మమత, సంస్థ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణలో సాహిత్యానికి అనుబంధం


శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి

పాత గుంటూరు: సనాతన భారతీయ సాంస్కృతిక జీవన ప్రవంతిలో సాహిత్యంతో విడదీయరాని అనుబంధం ఉందని కుర్తాళం శంకరాచార్య జగద్గురు శ్రీ సిద్ధేశ్వరి పీఠాధిపతులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి పేర్కొన్నారు. రవీంద్రనగర్ (కొత్త పట్టాభిపురం) కుర్తాళ శ్రీ సిద్ధేశ్వరి పీఠ మంత్రాశ్రమంలో 'శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి 87వ వసంతోత్సవాల్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి ప్రత్యక్ష సన్నిధిలో జరిగిన ధర్మ చైతన్య సాహితీ సభలో కవులు సుఖవాసి మల్లికార్జున రాయశాస్త్రి, రామడుగు వెంకటేశ్వరశర్మ, నారాయణ శేషుబాబు, గోలి హనుమత్ శాస్త్రి, అవ్వారి గోపాలకృష్ణశర్మ, కోగంటి వీర రాఘవాచార్యులు, రావి రంగారావు, నారాయణ శేషుబాబు, వి. నాగరాజ్యలక్ష్మి, మైలవరపు లలిత కుమారి, తాటికోల పద్మావతి తదితర కవులు సాహిత్య గోష్ఠిలో పాల్గొని ఆహూతుల్ని రంజింపచేశారు. అనంతరం సభకు మంత్రాశ్రమ నిర్వాహకులు శ్రీ నరసింహానంద భారతీస్వామి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.ఎస్. దీక్షిత్, గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్, కార్యక్రమ నిర్వాహకులు పి. హైమానంద్, రవి కిశోర్, రామకృష్ణ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ వద్ద ఆదివారం అనారోగ్యంతో మరణించిన అనాథ వృద్ధుడికి గుంటూరు కోవిడ్ ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేశారు. అనాథ శవం ఆస్పత్రిలో ఉన్నట్లు కొత్తపేట పోలీసులు సమాచారం ఇవ్వడంతో అంత్యక్రియలు నిర్వహించామని ట్రస్ట్ నిర్వాహకులు పఠాన్ అల్లాభక్షు తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవిడ్‌లో మరణించిన అనేకమందికి అంత్యక్రియలు చేశామని చెప్పారు. సొంతంగా అంబులెన్స్ పెట్టి గుంటూరు నగరంలో పేదల్ని ఆస్పత్రి నుంచి ఇళ్లకు, ఇళ్ల నుంచి ఆస్పత్రులకు ఉచితంగా తరలిస్తున్నామని తెలిపారు. జీజీహెచ్ వద్ద రోగుల సహాయకులకు దాతల సహాయంతో ఉచితంగా భోజనం పెడుతున్నామని వెల్లడించారు. అనాథలుగా రోడ్డుపై ఉంటున్న పలువురిని పలు వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాల్లో చేర్పించామని తెలిపారు. ట్రస్ట్ సేవల్ని వినియోగించుకోవాలనుకునేవారు 8143222456, 9397602553 నంబర్స్‌లో సంప్రదించాలని అల్లాభక్షు కోరారు.

అంబేడ్కర్ విజ్ఞాన ఘని


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సాంబశివరావు, ప్రభాకర్, కిరణ్

గుంటూరు ఎడ్యుకేషన్: అంబేడ్కర్ అంటే విజ్ఞాన ఘని అని గుంటూరు పశ్చిమ తహసీల్దార్ సాంబశివరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ జీవిత చరిత్ర, కుల నిర్మూలన, రాజ్యాంగం అనే అంశాలపై ఏసీ కళాశాలలో ప్రతిభా పరీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 200 మంది ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తహసీల్దార్లు సాంబశివరావు, ప్రభాకర్ మాట్లాడుతూ అంబేడ్కర్ అంటే ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడిచి, ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలన కోసం పాటుపడితేనే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన డెప్యూటీ తహసీల్దార్ దేవరాజ్ మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితంలో ప్రతి పేజీ ఒక పాఠమని చెప్పారు. కష్టాలు ఎదురైనప్పుడల్లా అంబేడ్కర్ చూపిన బాట మార్గం చూపుతుందని పేర్కొన్నారు. కులాల అడ్డుగోడలు కూలితేనే ఉత్తమ జాతి నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. రాజ్యాంగాన్ని పవిత్ర గ్రంథంగా ప్రతి ఒక్కరూ చదివి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజెస్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వృద్ధుడి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 1వ లైనుకు చెందిన నాగశివారెడ్డి తండ్రి అచ్చిరెడ్డి గత సంవత్సరం జూన్‌లో మతిస్థిమితం లేని కారణంగా ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయారు. ఆయన ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం నాగశివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పలువురి దాడి

ఓ యువకుడిపై పలువురు దాడి చేసి గాయపరిచిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట 7వ లైనులో యర్రా ఉదయ్‌కిరణ్ మేనకోడలితో మాట్లాడుతుండగా, కొంతమంది యువకులు వారిని చూసి కామెంట్ చేశారు. దీంతో ఉదయ్‌కిరణ్ వారిని ప్రశ్నించాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన యువకులు మరికొంత మందిని తీసుకుని వచ్చారు. నాగ అనే వ్యక్తి ఉదయ్‌కిరణ్‌పై రాడ్డుతో దాడి చేయగా రవితేజ, మరికొంతమంది రాళ్లతో, చేతులతో దాడి చేసి కొట్టారు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఉదయ్‌కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక భవనం ప్రారంభం

తెనాలి అర్బన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో నూతనంగా నిర్మించిన దాకా లక్ష్మిరెడ్డి, లక్ష్మమ్మ సామాజిక భవనాన్ని ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కొత్త సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.